RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 22 శనివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 199 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | SATURDAY AUGUST 22 2026 | VOL:16 | ISSUE: 199 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు అందుకే అనుమతి ఇవ్వలేదు.. విదేశాంగ శాఖ క్లారిటీ

**రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ**

**పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ**

**విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి**

**అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన**

**ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి**




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా.. పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్



**పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ**

**ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక (మిగతా 2వ పేజీలో..)

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. తెలంగాణలో 28 వరకు వానలు!

**బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం**

**తెలంగాణాలోని 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు**

**కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.
(మిగతా 2వ పేజీలో..)



## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!

**కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం**

**15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ**

**సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ**

**వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం**



తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్
(మిగతా 2వ పేజీలో..)

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

**సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత**

**రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ**

**పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు
(మిగతా 2వ పేజీలో..)




# మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్.. ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం

**కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం**

**మత్స్యకారుడు అప్పన్న కోసం గాలింపు ముమ్మరం చేయాలన్న హోంమంత్రి అనిత**

**కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విస్తృత గాలింపు చర్యలు**

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ భరోసా**

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా (మిగతా 2వ పేజీలో..)




## టాలీవుడ్‌లో విషాదం.. దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

**చెన్నై కావేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**శుక్రవారం మధ్యాహ్నం మరణించినట్లు నాజర్ వెల్లడి**

**వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన దిగ్గజ నటి**



1950లో 'షావుకారు' చిత్రంతో సినీ అరంగేట్రం

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు.సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా.. పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది.అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. తెలంగాణలో 28 వరకు వానలు!

(మొదటి పేజీ తరువాయి)

దీని ప్రభావం కారణంగా తెలంగాణలో నేటి (ఆగస్టు 21) నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.ప్రధానంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## టాలీవుడ్‌లో విషాదం.. దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

2022లో పద్మశ్రీ పురస్కారం



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఇటీవలే ఆమె చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు నటీనటుల సంఘం అధ్యక్షుడు నాజర్ ప్రకటించారు. రాజమహేంద్రవరానికి చెందిన శంకరమంచి జానకి, సినీ రంగంలో 'షావుకారు జానకి'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1950లో ఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'షావుకారు'తో ఆమె వెండితెర అరంగేట్రం చేశారు. ఆ సినిమా విజయం తర్వాతే ఆమె పేరుకు ముందు 'షావుకారు' చేరింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం సాగింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరతో పాటు బుల్లితెరపైనా నటించారు. ఇటీవల కూడా తెలుగు సినిమాల్లో కనిపించారు. ఆమె చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు.మొత్తంగా షావుకారు జానకి 450కు పైగా సినిమాల్లో నటించారు. నాలుగు తరాల నటీనటులతో కలిసి పనిచేసిన ఘనత ఆమె సొంతం. ఏంజీఆర్, జయలలిత, ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, శివాజీ గణేశన్, రాజ్‌కుమార్ వంటి దగ్గజాలతో స్క్రీన్ చేసుకున్న నటిగా ఆమె రికార్డు సృష్టించారు. సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించింది. దశాబ్దాల పాటు సాగిన ఆమె నటనా ప్రస్థానం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది.

# నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు: కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు."సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

# మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్.. ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానం అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు. "బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?" అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు.ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అడగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశు వులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.



# ఎమ్మెల్యేలకు ఫ్రీగా కార్లు ఇస్తామన్న సీఎం విజయ్.. వద్దన్న ఉదయనిధి స్టాలిన్

### తమిళనాడులో ఎమ్మెల్యేలందరికీ ఉచిత కార్లు ఇస్తామన్న సీఎం విజయ్

### డ్రైవర్, ఇంధనం కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ ప్రకటన

### ప్రభుత్వ ఆఫర్‌ను తిరస్కరించిన ప్రతిపక్ష డీఎంకే

### రాష్ట్ర అప్పులను గుర్తుచేస్తూ.. కార్లు వద్దని తెలిపిన ఉదయనిధి స్టాలిన్

### సొంతంగా కారు లేని వారికే ఈ పథకమన్న ప్రభుత్వం

తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య వాహనాల కేటాయింపు వ్యవహారం రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ ప్రభుత్వ ఖర్చుతో కార్లు అందజేస్తామని ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటనను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను తమ పార్టీ తిరస్కరిస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు.శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 234 మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గ పనుల నిమిత్తం ప్రభుత్వ వాహనాలు సమకూర్చుతామని ప్రకటించారు. వీటితో పాటు డ్రైవర్, ఇంధనం, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ. 75,000 అలవెన్స్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక నేపథ్యం లేని కొత్త ఎమ్మెల్యేలకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, పారదర్శకమైన, అవినీతిరహిత పాలనకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది.అయితే, ప్రభుత్వ నిర్ణయంపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రం అప్పుల్లో ఉందని పదేపదే చెబుతున్న టీవీకే ప్రభుత్వం, ఇప్పుడు ఎమ్మెల్యేలకు కార్లు పంపిణీ చేయడమేమిటని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు ఈ కార్లను తీసుకోబోరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలించి, సొంత వాహనాలు లేని వారికి మాత్రమే ఈ సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు.డీఎంకే విమర్శలపై మంత్రి ఆధవ్ అర్జున ఘాటుగా స్పందించారు. ఈ పథకం కింద సొంతంగా కారు లేని ఎమ్మెల్యేలకు మాత్రమే వాహనాలు కేటాయిస్తామని ఆయన స్పష్టతనిచ్చారు. ఇది విలాసం కాదని, ప్రజాసేవకు అవసరమైన కనీస సదుపాయమని వ్యాఖ్యానించారు. అనేక బంగ్లాలు ఉన్నప్పటికీ ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఎందుకు నివసిస్తున్నారని ఆయన నిలదీశారు. ముఖ్యంగా చిన్న పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఈ వాహనాలు ఎంతో అవసరమని ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది.



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
ఆగస్టు । శనివారం । 22 । 2026



# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడమే విజయానికి తొలిమెట్టు

**మరిపెడ సీఐ ఎల్. పవన్‌కుమార్**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 21**



విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, నైతిక విలువలను పాటించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని మరిపెడ సీఐ ఎల్. పవన్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కాలేజీ, పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, నైతిక ప్రవర్తనపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ గంద్రాతి సతీష్ విద్యార్థులతో మాట్లాడి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు విద్యార్థులు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ మోసాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

**నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి**

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలని, చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ పవన్‌కుమార్ సూచించారు. ఇటీవల చోటుచేసుకున్న పలు నేర సంఘటనలను ఉదాహరణగా వివరిస్తూ.. చిన్న వయసులోనే తప్పుదారి పట్టడానికి కారణమయ్యే పరిస్థితులు, చెడు ప్రభావాలు, ఆవేశపూరిత నిర్ణయాల గురించి విద్యార్థులకు వివరించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవంతో మెలగాలని, సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశానికి లోనుకాకుండా వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక యువత కలిగిన దేశాల్లో భారతదేశం ముందంజలో ఉందని, నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రోత్సహించారు.

**దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే..**

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని ఎస్ఐ గంద్రాతి సతీష్ అన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కాలేజీ, పాఠశాల ప్రిన్సిపాల్ రాంమోహన్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, పీఈటీ బాలు మహేంద్రతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవో 97 రద్దు చేయకుంటే మానుకోట నుంచే మహాప్రస్థానం

**పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు**

**అంబేద్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జీలతో డీఎస్ఎఫ్ఐ నిరసన**

**దేశ టైమ్స్మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 21**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో నెంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మానుకోట గడ్డ నుంచే మహాప్రస్థానం ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

**విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీయొద్దు**

ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. జీవో నెంబర్ 97పై ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి, విద్యార్థులకు నష్టం కలిగించే అంశాలను తొలగించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలు వారి విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

జీవో నెంబర్ 97ను రద్దు చేయకుండా ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తే ఉద్యమాన్ని దశలవారీగా మరింత ఉధృతం చేస్తామని డాక్టర్ వివేక్ హెచ్చరించారు. “మానుకోట గడ్డ నుంచే మహాప్రస్థానం ఉద్యమానికి శ్రీకారం చుడతాం. విద్యార్థుల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం” అని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం అణచివేసే ప్రయత్నం చేయకుండా సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



**విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి**

రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం గుర్తించాలని నాయకులు కోరారు. విద్యా రంగానికి సంబంధించిన నిర్ణయాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. జీవో నెంబర్ 97ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ లక్ష్మణ్ నాయక్, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్యప్రకాశ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత పాల్గొన్నారు. అలాగే డీఎస్ఎఫ్ఐ నాయకులు దేవేందర్, జవహర్, రమేష్, శివవర్మ, కేసముద్రం నాయకులు అభిరామ్, షోయబ్, శ్రవణ్, సురభి సాయి, విఘ్నేష్, గౌతమ్, నవదీప్, రాకేష్, సంతోష్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొని నిరసన తెలిపారు.

# సురమ్మ తల్లికి ఘనంగా బోనం సమర్పించిన గ్రామస్తులు

**రుద్రంగి ఆగస్టు21(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో వెలసిన సురమ్మతల్లికి గ్రామస్తులు ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనం నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో సురమ్మతల్లికి బోనం సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. సురమ్మతల్లి దీవెనలతో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని కుల సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మునిగేపల్లి ఫోటోగ్రాఫర్ అనంతుల రాంబాబు గౌడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో సత్తా చాటిన మునిగేపల్లి ఫోటోగ్రాఫర్**

**ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్-2026లో ప్రీ వెడ్డింగ్ విభాగంలో సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్, షీల్డ్ అవార్డు**






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 21 (దేశ టైమ్స్):**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్–2026లో ఖమ్మం జిల్లా మునిగేపల్లికి చెందిన ఫోటోగ్రాఫర్ అనంతుల రాంబాబు గౌడ్ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల సందర్భంగా హుస్సేన్ ఖాన్ ఆర్ట్ ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఫోటోగ్రాఫర్ల కోసం ఖమ్మం ఫోటోగ్రఫీ కాంటెస్ట్–2026ను నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ఖమ్మంలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 122 మంది ఫోటోగ్రాఫర్లు 1,072 ఫోటోలను పోటీకి పంపినట్లు నిర్వాహకులు తెలిపారు. పిక్టోరియల్ (బ్లాక్ అండ్ వైట్), కలర్, వెడ్డింగ్, ఫెస్టివల్, నేచర్, ప్రీ వెడ్డింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మునిగేపల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ అనంతుల రాంబాబు గౌడ్, ప్రీ వెడ్డింగ్ విభాగంలో కాబోయే వధూవరులు పడవలో ప్రయాణిస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించిన ఫోటోకు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్‌తో పాటు షీల్డ్ అవార్డును సాధించారు. ఖమ్మంలో జరిగిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఖమ్మం అడిషనల్ డీసీపీ బొజ్జ రామానుజం చేతుల మీదుగా రాంబాబు గౌడ్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ బొజ్జ రామానుజం మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సేవలు ఎంతో కీలకంగా మారాయని అన్నారు. అనేక కేసుల దర్యాప్తు, ఛేదనలో ఫోటోలు, వీడియోలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఫోటోగ్రాఫర్లు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఫోటోగ్రఫీ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌కే ఆర్ట్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులు హుస్సేన్ ఖాన్, తెలంగాణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, వనమాల శ్రీనివాస చారి, ఖమ్మం జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్గాని వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న అనంతుల రాంబాబు గౌడ్‌ను ఖమ్మం జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్‌కే ఆర్ట్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులు హుస్సేన్ ఖాన్, ప్రముఖ సీనియర్ ఫోటోగ్రాఫర్లు, మునిగేపల్లి గ్రామ సర్పంచ్ గంగా స్రవంతి–రవి, గ్రామ పెద్దలు రామ వీరభద్రం, ముక్కా వీరయ్య చౌదరి, ముక్కా శ్రీనివాస్, రామా పూర్ణ, కాసుల కృష్ణ తదితరులు అభినందించారు.

# ఏఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఆంజనేయులు, మహేష్

**వలిగొండ, ఆగస్టు 21(దేశ టైమ్స్)**






మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏఐటియుసి నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కనకబోయిన ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి మహేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యవర్గ సభ్యులుగా కందుకూరి సంజీవ, ఐలపాక స్వామి, నానచర్ల వెంకటేష్, గద్దల నర్సింహా, బోలుగుల రాశీమూర్తి, మహేష్ లను ఎన్నుకున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వలిగొండ, ఆగస్టు 21 (దేశ టైమ్స్)**

మండలంలోని అరూర్ సబ్ స్టేషన్ లోని అరూర్, వెలువర్తి, పులిగిల్ల ఫీడర్ మరమ్మత్తుల కారణంగా అరూర్, వెలువర్తి పులిగిల్ల, గురునాథ్ పల్లి, జంగారెడ్డిపల్లి,అప్పారెడ్డిపల్లి, నర్సాయిగూడెం, కంచనపల్లి గ్రామాలకు నేడు మధ్యాహ్నం 12 గంటల నుండి, 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని విద్యుత్ ఏఈ నర్సింహా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## రుద్రంగిలో బిజెపి ఛాయ్ పే చర్చ కార్యక్రమం

రుద్రంగి ఆగస్టు21(దేశ టైమ్స్)



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణు ఆధ్వర్యంలో ఛాయ్ పే చర్చ కార్యక్రమన్నీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నామనేని వికాస్ రావు పాల్గొని కార్యకర్తలతో నాయకులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన,SIR ప్రక్రియ మొదటి దశ ముగిసిందని నియోజకవర్గ రెండవ దశ ప్రారంభం అయిందని అన్నారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 26వేల ఓట్లు గల్లంతు అయ్యాయని నన్నారు.ఆర్హులైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రతి బూత్ లోని పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజల్లోకి వెల్లి బిజెపి పార్టీ సిద్ధాంతాలను కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో, మండల ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్,అక్కినపల్లి నర్సింగరావు, లావుడ్యా శ్రీనివాస్,భాషని దయానందం,గంటే మల్లయ్య, రాచకొండ గంగ నరసయ్య,చెట్టుపల్లి జనార్ధన్,నేవురి శేఖర్,లవుడ్యా మహిపాల్,మర్రిపల్లి దశరథం, తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 21(దేశ టైమ్స్ )



బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం ఇటివల రోడ్ ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే,ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకుడు వల్లంకొండ రాంబాబు ఆధ్వర్యంలో "సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత" అని మిత్రులందరితో గ్రూప్ ఏర్పాటు చేసి వారి కుటుంబానికి, ముగ్గురు పిల్లలకు ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిస్తే స్పందించి సుమారు 200 మంది రూ.4,52,000 సేకరించారు.ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో వారి పిల్లల పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను కుటుంబసభ్యులకు సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు,సర్పంచ్ మంద కరుణ,ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య,యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఫిక్స్డ్ డిపాజిట్ చేశాం అని,దాతల నుంచి సేకరించిన సుమారు రూ.4.50 లక్షల మొత్తాన్ని పిల్లల చదువుల నిమిత్తం ఫిక్స్డ్ డిపాజిట్ చేయడం జరిగింది అని పేర్కొన్నారు. రిపోర్టర్ సత్యానందం అకాల మరణంతో ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కుటుంబానికి అండగా నిలిచేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించిన నేపద్యంలో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యానందం కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న దాతలు మానవతా దృక్పథంతో అందించిన సహాయాన్ని మాత్రమే కాకుండా, ఆయన పిల్లల భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు..సత్యానందం కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్క దాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఒక కుటుంబానికి మిత్రులు అందరూ అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సత్యానందం కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు మా తరుపున అందిస్తామని వారు అన్నారు.సత్యానందం పిల్లల చదువులకు భరోసాగా నిలిచేలా రూ.4.50 లక్షలను ఫిక్స్డ్ డిపాజిట్ చేయడం ద్వారా దాతలు అందించిన ఆర్థిక సహాయానికి ఒక సార్థకమైన ప్రయోజనం కలిగిస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ సురేష్,కొమ్ము శ్రీనివాసరావు,ఇరుగు జానేష్,తమ్మారపు లక్ష్మణరావు,పసుపులేటి వెంకటేశ్వర్లు,ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరరావు,ముత్తరపు రవి,మంద జాన్, కల్యాణపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్ కు మాజీ సీఎం జగన్!

దేశ టైమ్స్ : న్యూస్ ప్రతినిధిలి అమరావతి:ఆగస్టు 21



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, నేడు హైదరాబాద్ కు బయలుదేరి రాను న్నారు. హైదరాబాద్ పర్యటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో నూ, ఆయన అభిమానుల్లోనూ విశేష ఆసక్తిని రేకెత్తిస్తోంది. సీనియర్ ఐపీఎస్ అధికారి పెండ్యాల సీతారామాంజనేయ శర్మ కుమారుడి వివాహ వేడుకకు ఆయన హాజరుకా నున్నారు జగన్ రాకను పురస్కరిం చుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్సీపీ శ్రేణులతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయ కులు నగరంలో అడుగడుగునా ఘన స్వాగత ఏర్పాట్లు చేశారు. శేరిలింగం పల్లికి చెందిన బీఆర్ఎస్ నేత చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యం లో బేగంపేట ఎయిర్పోర్ట్ నుంచి జలవిహార్ వరకు ప్రధాన మార్గా ల్లో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి.ఈ స్వాగత ఏర్పాట్ల లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది, వైఎస్ జగన్తో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వా హక అధ్యక్షుడు కేటీఆర్,చిత్రాలను ఒకే కటౌట్లో పొందు పరచడం. ధీరుడు వైఎస్ జగన్కు స్వాగతం వజ్రం ఎక్కడ ఉన్నా మెరుస్తుంది' అనే ఆకట్టుకునే నినాదాలతో కూడిన ఈ బ్యానర్లు నగరం లో వెలిసి రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. గతంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ సంబంధా లు, సమీకరణాలను ప్రతిబింబించేలా ఈ కటౌట్లు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తు న్నారు. బేగంపేట, పంజాగుట్ట, రాజ్భవన్ రోడ్డు, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ భారీ ఫ్లెక్సీలు అటుగా వెళ్లే బాటసారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

## అర్హత గల ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా చర్యలు









**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 21 ( దేశ టైమ్స్)

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో అర్హత గల ప్రతి ఓటరు పేరు తుది ఓటర్ల జాబితాలో కొనసాగించడమే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత మూడు నెలలుగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్ల ఖమ్మం జిల్లాలో అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు చాలా తక్కువగా నమోదయ్యాయని తెలిపారు. ఇతర జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గంలో సగటున 50 వేల వరకు అనామలీస్, నో మ్యాపింగ్ ఓట్లు నమోదవుతున్నప్పటికీ, ఖమ్మం జిల్లా ప్రస్తుతం మెరుగైన స్థితిలో ఉందన్నారు.ప్రస్తుతం అధికారులు ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేయడం, వచ్చే రెండు నెలల్లో క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించడం ముఖ్యమన్నారు.ప్రతి అనామలీపై ప్రత్యేక అబ్స్ట్రాక్ట్ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి అధికారి, సిబ్బందికి క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్కు సంబంధించి గుర్తించిన వివిధ రకాల అనామలీస్పై ప్రత్యేక అబ్స్ట్రాక్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు.పేర్లలో వ్యత్యాసాలు, తండ్రి--కొడుకుల వయస్సు మధ్య 15 సంవత్సరాల కంటే తక్కువ వ్యత్యాసం, తాత--మనవడి వయస్సు మధ్య 40 సంవత్సరాల కంటే తక్కువ వ్యత్యాసం, ఒకే ఓటరుకు ఆరు కంటే ఎక్కువ ఓట్లు మ్యాప్ కావడం తదితర కారణాలతో అనామలీస్ ఏర్పడ్డాయని తెలిపారు.పేరు మార్పు లేదా పేర్లలో వ్యత్యాసాలకు సంబంధించిన కేసుల్లో ఓటరు పేరు మార్పుకు గల కారణాన్ని వివరిస్తూ డిక్లరేషన్ తీసుకోవాలని, సంబంధిత ఆధారాలను పరిశీలించిన అనంతరం కేసులను పరిష్కరించాలని సూచించారు.నోటీసుల్లో విచారణ వివరాలు స్పష్టంగా ఉండాలి ప్రతి నోటీసులో విచారణ తేదీ, సమయం, ప్రదేశం స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండాలని స్పష్టం చేశారు. విచారణ వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్లో అప్లోడ్ చేయాలని సూచించారు. పేరు వ్యత్యాసాల కేసులకు ముందుగానే విచారణ తేదీలను నిర్ణయించి, నోటీసులు జారీ చేసే సమయంలోనే వాటిని పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 27 నుంచి విచారణలు ప్రారంభమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. 11 రకాల ధృవపత్రాలపై అవగాహన కల్పించాలి మిగిలిన అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేసే సమయంలో ఓటర్ల వద్ద 11 రకాల ధృవపత్రాల్లో ఏవైనా ఉన్నాయా అనే వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంబంధిత ధృవపత్రాలు లేని అర్హులైన ఓటర్లకు కుల ధృవపత్రాలు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక దరఖాస్తు నమూనా రూపొందించామని, ధృవపత్రాలు లేని ఓటర్లతో దరఖాస్తులు పూర్తి చేయించి, ధృవపత్రం జారీకి అవసరమైన పత్రాలను సేకరించాలని తెలిపారు. ఓటర్లకు 11 రకాల ధృవపత్రాలపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన ఆధారాలను సమర్పించేలా చైతన్యపరచాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటు పునరుద్ధరణే లక్ష్యం అర్హత గల ప్రతి ఓటరు ఓటును పునరుద్ధరించడమే తమ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. పేరు మార్పు సంబంధిత అనామలీస్కు శనివారం నుంచే నోటీసుల తయారీ ప్రారంభించాలని, సోమవారం నుంచి ఇతర ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలను భాగస్వాములను చేసి నోటీసులు, విచారణ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్హమైన ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా వారి సహకారం తీసుకోవాలని అన్నారు.విచారణ తేదీని ఒకసారి మాత్రమే వాయిదా వేసే అవకాశం ఉంటుందని, ఓటరు విచారణకు హాజరై అవసరమైన ఆధారాలు సమర్పించకపోతే తుది ఓటర్ల జాబితా నుంచి ఆ ఓటు తొలగిపోయే అవకాశం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. విచారణల నిర్వహణకు అవసరమైన అధికారులను నియమించాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపి ఎన్నికల సంఘం అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెక్టార్ అధికారులను గుర్తించి విచారణ ప్రక్రియలో వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసీ సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ అన్సారీ, ఏఈఆర్ఓలు, మునిసిపల్ కమిషనర్లు, బీఎల్ఓ సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

**ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, సుమంగళులకు తాంబూలాల పంపిణీ**

ఖమ్మం ప్రతినిధి। ఆగస్టు 21 (దేశ టైమ్స్):

శ్రావణ మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు ఇళ్లను శుభ్రం చేసి, గడపలకు ముగ్గులు వేసి, మామిడి తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజా మందిరాలను శోభాయమానంగా తీర్చిదిద్ది వరలక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వ్రతంలో భాగంగా మహిళలు సంప్రదాయబద్ధంగా కలశాన్ని ప్రతిష్ఠించి, దానికి పసుపు, కుంకుమ, పూలతో అలంకరణ చేశారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, కొత్త వస్త్రాలు, ఆభరణాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా వరలక్ష్మీ వ్రత కథను భక్తిశ్రద్ధలతో చదివి, అష్టోత్తర శతనామావళి, లక్ష్మీ అష్టకం తదితర స్తోత్రాలను పఠించారు. ఇంటిల్లిపాదీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆర్థిక అభివృద్ధి, ఐశ్వర్యం, కుటుంబ శ్రేయస్సు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.అమ్మవారికి పండ్లు, పిండి వంటలు, పులిహోర, చక్కెర పొంగలి తదితర నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక దీపారాధన చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ వరలక్ష్మీదేవి ఆశీస్సులు పొందారు. సుమంగళులను ఆహ్వానించి పసుపు, కుంకుమ, తాంబూలాలు, పండ్లు, ప్రసాదాలను అందజేశారు.

మహిళలతో కళకళలాడిన ఆలయాలు, ఇళ్లు

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఆలయాలు, మహిళల ఇళ్లు భక్తులతో సందడిగా కనిపించాయి. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. పలుచోట్ల సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం, సౌభాగ్యం కలుగుతాయని మహిళల విశ్వాసం. ముఖ్యంగా సుమంగళీ స్త్రీలు తమ భర్తల ఆయురారోగ్యాలు, కుటుంబ సభ్యుల క్షేమం కోసం ఈ వ్రతాన్ని భక్తితో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సంప్రదాయాలకు ప్రతీకగా వరలక్ష్మీ వ్రతం

శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయంలో విశిష్టమైనదిగా భావిస్తారు. సంపద, సౌభాగ్యం, శ్రేయస్సుకు ప్రతీకగా వరలక్ష్మీదేవిని పూజిస్తూ మహిళలు ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆచారం కుటుంబాల్లో ఆధ్యాత్మికతతో పాటు సంప్రదాయాలను కాపాడేలా చేస్తోంది.ఈ సందర్భంగా చిన్నారులకు, యువతులకు పెద్దలు వ్రత విశిష్టతను వివరించారు. కుటుంబ సభ్యులంతా కలిసి పూజల్లో పాల్గొనడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు భక్తి, సంప్రదాయం, సౌభాగ్యానికి ప్రతీకగా ఘనంగా జరిగాయి.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280